

ఘనంగా బోనాల పండుగ

గోదావరిఖని: దేవీనవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సింగరేణి ఓసీపీ–5 సైట్‌ఫీస్ వరకు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



బతుకమ్మ సంబురం

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి గ్రామానికి చెందిన యాంసాని విజయ–జగదీశ్వర్ దంపతుల కూతురు స్వాతి–సంతోష్ దంపతుల ఆధ్వర్యంలో అమెరికా డల్లాస్‌లో బతుకమ్మ ఆడారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/24.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవతుంది. జిల్లాలోని కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

డీఎస్సీలో అర్హతల పంచాయితీ

రావుల స్వాతి.. కరీంనగర్ జిల్లా నుంచి బీఈడీ చేసింది. 2012లో టెట్ పాసైంది. ఆమెకు స్పెషల్ ఎడ్యుకేషన్ ఇన్ డిప్లొమా ఉంది. స్పెషల్ బీఈడీ కోర్సులో చేరినా పూర్తి కాలేదు. అయినా, ఆమె పేరు తాజా ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన 1:3 లిస్టులో ఉంది. అసలు స్పెషల్ బీఈడీ పూర్తి చేయకుండా టెట్ రాయడం నిబంధనలకు విరుద్ధమని, కేవలం 2024 సంవత్సరం డీఎస్సీ కోసం దరఖాస్తు చేసిన ప్రామాణిక అప్లికేషన్‌లో ఎంటర్ చేసిన వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని లఖన్‌బాబు అనే అభ్యర్థి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.

మాలోత్ రవి.. ఇతను 1 నుంచి 5వ తరగతి వరకు పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. కానీ, పెద్దపల్లి డీఎస్సీలో పోస్టులు లేవు. దీంతో, కరీంనగర్ పోస్టులకు పరీక్ష రాశాడు. ఇందుకోసం 1 నుంచి 5వ తరగతి వరకు కరీంనగర్‌లోని రాంనగర్ అరుణోదయ ప్రైమరీ స్కూల్లో చదువుకున్నట్లు దరఖాస్తు చేసుకున్నాడు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. అతను నాన్‌లోకల్ అయినా కరీంనగర్‌కు లోకల్ కేండిడేట్‌గా పరీక్ష రాసేందుకు రాంనగర్‌లో చదువుకున్నట్లు సర్టిఫికెట్లు తెచ్చాడన్న ఆరోపణలున్నాయి. ఇదే వ్యక్తి గ్రూప్–1, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, గ్రూప్–4 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నాడు. వాటిలో తాను పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేసినట్లు పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించి అతని దరఖాస్తులను పలువురు అభ్యర్థులు చూపిస్తున్నారు. అవి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒకే వ్యక్తి రెండు జిల్లాల్లో స్థానికుడిగా ఎలా పరీక్షలు రాస్తాడని జిల్లా ఉన్నతాధికారులను పలువురు నిలదీస్తున్నారు.



TGDSC-2024 APPLICATION OF RA...

రవి డీఎస్సీ అప్లికేషన్‌లో అరుణోదయ ప్రైమరీ స్కూల్ (రాంనగర్)



గ్రూప్–2 అప్లికేషన్‌లో పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ ప్రగతి విద్యామందిర్ స్కూల్

- స్థానికత కోసం నకిలీ ధ్రువపత్రాల సృష్టి
- కరీంనగర్ స్థానికతతో పెద్దపల్లి అభ్యర్థి దరఖాస్తు
- జీఈడీకి ముందే టెట్ పాస్ చెల్లదంటున్న అభ్యర్థులు
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

2008 డీఎస్సీలో జరిగిన తప్పిదాలకు ఉమ్మడి జిల్లా నుంచి 186 మందిలో మెరిట్ జాబితాలో ఉన్నవారిని తీసుకొని, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగావకాశాలు కల్పించాలని న్యాయస్థానం సూచించింది. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరిట్ జాబితాలో ఉన్నవారి విద్యార్హత సర్టిఫికెట్లను అధికారులు ఈ నెల 5వ తేదీ వరకు పరిశీలించారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కాకుండా రెండు రోజులు ఆలస్యంగా జాబితా ప్రదర్శించడం, మొదటిరోజు అందులో 13 మంది పేర్లు గల్లంతవడం, 25 మందిని కొత్తగా చేర్చడం వంటి అంశాలు హాట్ టాపిక్‌గా మారాయి.

కొత్త పేర్ల నమోదుపై ఆందోళన..

2008లో అప్పటి డీఈవో వెంకటేశ్వర్లు హయాంలో రూపొందించిన మెరిట్ జాబితా ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని, తమ పేర్లు గల్లంతయ్యాయని, కొత్త పేర్లు ఎలా నమోదయ్యాయో చెప్పాలంటూ అభ్యర్థులు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇది ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోవడంతో అధికారులు తీరుపై విమర్శలు చేశారు. వీరికి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వాల్సిందేనని హైకోర్టు చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో నియామక ప్రక్రియకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. అప్పటి మెరిట్ జాబితాలో తమ పేర్లు ఉన్నా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవలేదని, కొత్త పేర్లు ఎలా జాబితాలోకి వచ్చాయంటూ అభ్యర్థులు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా వారికి జవాబు చెప్పే నాథుడు లేడు. దీంతో పాత మెరిట్ జాబితాలో ఉన్న 8 మంది ఇటీవల ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే.

2024 నియామకాలపైనా సందేహాలు..

అలాగే, 2024 డీఎస్సీ ఫలితాలు వెల్లడైన తర్వాత ఈ నెల 4వ తేదీ వరకు అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. ఈ నియామకాల్లోనూ అనేక తప్పిదాలు దొర్లినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అభ్యర్థుల సందేహాలను విద్యాశాఖ అధికారులు నివృత్తి చేయకపోవడం అవినీతి జరిగిందన్న అనుమానాలకు తావిస్తోంది. జిల్లా విద్యాశాఖలో బదిలీలు, పదోన్నతులు, కొత్తగా డీఎస్సీ నియామకాలు జరిగినప్పుడల్లా మెరిట్ జాబితా ప్రదర్శించడం, రోస్టర్ కం రిజర్వేషన్ పాటించడం, సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో గందరగోళం జరగడం రివాజుగా మారుతోంది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వెలువరించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా కరీంనగర్ జిల్లా విద్యాశాఖలో ప్రతిదీ ఆలస్యమవడం, ప్రక్రియను సాగదీయడం, అభ్యర్థుల ప్రశ్నలకు జవాబులు లేకపోవడం డీఎస్సీ నియామకాల్లో ఏం జరుగుతుందోనన్న చర్చకు కారణమవుతున్నాయి.



తళుక్కుమన్న తమన్నా

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామానికి చెందిన దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న సినిమా ఓదెల–2 చిత్రీకరణ సోమవారం ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధితోపాటు ఓ పాఠశాలలో జరిగింది. హీరోయిన్ తమన్నా భాటియాతోపాటు పలువురు నటీనటులు పాల్గొన్నారు. సినిమా షూటింగ్‌తోపాటు తమ అభిమాన తార తమన్నాను తిలకించేందుకు అభిమానులు, గ్రామస్తులు భారీసంఖ్యలో ఓదెలకు తరలివచ్చారు.

గోడు వినండి.. గోస తీర్చండి

- ప్రజావాణిలో అభాగ్యుల విన్నపం
- వినతులు స్వీకరించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష
- సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

పెద్దపల్లిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలనే ఆశతో జిల్లాలోని నలుమూలల నుంచి అభాగ్యులు సోమవారం కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. అయితే, ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

- తొమ్మిదేళ్లుగా ధర్మారం సమీపంలోని నందిమేడారం పంప్‌హౌస్‌లో పనిచేస్తున్నం.. కనీస వేతనం అందించి, ఉద్యోగ భద్రత కల్పించాలి.

  – టెక్నికల్ సిబ్బంది విన్నపం

- మా తాతముత్తాతల నుంచి వచ్చిన భూమి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు.. తహసీల్దార్ విచారణ జరిపారు.. అయితే, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పట్వారీ రూ.13వేలు తీసుకున్నరు. ఇప్పటికీ ఆన్‌లైన్‌లో రావడం లేదు.. పదేండ్ల నుంచి ఆఫీసు చుట్టూ తిరుగుతున్న. మీరైనా న్యాయం చేయండి.

  – ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ వాసి చాంద్‌మియా

రుణమాఫీ కాలే



సాగు కోసం బ్యాంకు నుంచి తీసుకున్న రుణం ఇంకా మాఫీ కాలే. రూ.2లక్షల కన్నా ఎక్కువగా ఉన్నందున సమయం పడుతుందని అధికారులు అంటున్నారు. ఇందుకు నిబంధనలు ఏమిటనే విషయం స్పష్టంగా చెప్పడం లేదు. నాకు పంట రుణమాఫీ వర్తించేలా చూడాలి.

– అడిచెర్ల మల్లేశం, పెద్దకల్వల

ఇల్లు ఇప్పించండి



ఏ ఆధారం లేదు. దివ్యాంగుడిని. నిరుపేదను. డబుల్‌బెడ్రూమ్ ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న. జాబితాలో నా పేరు రాలే. నాకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు కేటాయించి ఆదుకోవాలి. వారధిలో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న. ఏదైనా ఆఫీసులో పనికల్పించాలి.

– నాగరాజు, దివ్యాంగుడు, పెద్దపల్లి

న్యూస్‌రీల్

క్రీడాకారులకు ప్రోత్సాహం



పరికరం అందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపిన అర్చనకు కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కాంపౌండ్‌బో అందజేశారు. ముత్తారం మండలం కాసర్లగడ్డ కు చెందిన అర్చన గతేడాది జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి స్పోర్ట్స్ కోటాలో బాసర ట్రిపుల్‌ఐటీలో సీటు సంపాదించింది. తనకు కాంపౌండ్‌బో ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించింది. స్పందించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష.. రూ.1,25,328 వెచ్చించి కాంపౌండ్‌బో పరికరం కొనుగోలు చేసి అర్చనకు అందించారు. ఇష్టమైన ఆర్చరీలో గొప్పగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. జిల్లా క్రీడాధికారి సురేశ్ ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

జూలపల్లి(పెద్దపల్లి): ఈజీఎస్ వనమహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో సంధ్యారాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎఫ్ఏల నుంచి రూ.2,429 రికవరీ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ అధికారులు వేణు, అబుడ్స్‌మన్ శరత్ కుమార్, ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఫస్ట్‌క్లాస్ మేనేజర్' కోర్సు



అధికారులతో జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణిలోని ఫస్ట్‌క్లాస్ మేనేజర్ సర్టిఫికెట్ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణపొందిన 29మంది అధికారులను అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీఅంశాన్ని సద్వినియోగం చేసుకుని సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేట్ ఐఅండ్‌పీఎం జీఎం రవికుమార్, హెచ్ఆర్‌డీ జీఎం వి.కృష్ణయ్య, నిమ్ డీజీఎం ఎస్డీజే హుస్సైనీ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు అందుతున్నాయా?



పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పెద్దపల్లిరూరల్: కేంద్రప్రభుత్వం అందిస్తున్న నిధులతో అమలవుతున్న ఉపాధిహామీ పనుల ద్వారా లబ్ధి కలుగుతోందా? అని కేంద్ర బృందంలోని సభ్యులు బాలమురళి, సునీల్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మూలసాల, రాగినేడు గ్రామాల్లో సోమవారం వారు పర్యటించారు. ఈజీఎస్ కింది చేపట్టిన పనులను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పిస్తున్నారా? చేసిన పనులకు కూలి సకాలంలో చెల్లిస్తున్నారా? అనే విషయాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేశ్‌బాబు, టీఏ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్ఎఫ్‌సీఎల్ సీఎండీ రాక



యు.శరవణన్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) సీఎండీ యు.శరవణన్ ఈనెల 9న కర్మాగారంలో పర్యటిస్తారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింగల్ సోమవారం అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, వివిధ విభాగాల ఉద్యోగులు సీఎంఠ పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పక్కాగా 'ఫ్యామిలీ డిజిటల్' సర్వే

- సర్వేతో కుటుంబాల సంఖ్య నిర్ధారణ
- సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ప్రాంతాల్లో డిజిటల్ కార్డు సర్వే పక్కాగా జరగాలని, దీని ఆధారంగానే కుటుంబాల సంఖ్య తేలుతుందని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్టు పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎంపిక చేసిన గ్రామాలు, వార్డులు, డివిజన్లలో చేపట్టిన సర్వే వివరాలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన ప్రాంతాల్లో 1,127 కుటుంబాలు ఉంటాయని రికార్డులు చెబుతుంటే, 1,700 వరకు కుటుంబాలు ఉండొచ్చని జిల్లా యంత్రాంగం భావించగా.. వాస్తవంగా 2,047 కుటుంబాల వివరాలను సర్వే ద్వారా సేకరించారని వివరించారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఫొటోలే ప్రామాణికం కాకుండా వివరాలను పక్కగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో వీరబుచ్చయ్య, జెడ్పీ సీఈవో నరేందర్, ఆర్డీవో గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎస్డీ శ్రీనివాస్, కలెక్టర్ శ్రీహర్ష

రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలో రూ.కోటి 20 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం ప్రారంభించారు. పట్టణ ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పన కోసం పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మించి ప్రజల ఇబ్బందులను దూరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు పూదరి చంద్రశేఖర్, భాగ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, నాయకులు రవి, సతీశ్, ఓదెలు, బొంకూరి సురేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

ఓట్ల రాజకీయం వద్దు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓట్ల రాజకీయం వద్దని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేద్దామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.1.34 కోట్ల వ్యయంతో చేట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణాభివృద్ధికిరూ. 10 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామని, టెండరు ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. పండుగ తర్వాత పనులను ప్రారంభిస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు చింతల సునీత, నిషాత్ కాతున్,, దున్నపోతుల రాజయ్య, మాజీ జెడ్పీటీసీ స్వరూప, పీఏసీఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఘనంగా చక్రప్రతిష్ఠ కల్యాణోత్సవం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గర్రెపల్లి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో చక్రప్రతిష్ఠాపన కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలాగే దుర్గా మాత ఆలయాన్ని దర్శించుకున్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీడీఎంఏ గౌతం
- బల్దియా కంపోస్ట్‌యార్డ్ నుంచి పాల్గొన్న ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ



కంపోస్టు యార్డ్ వద్ద వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ. చిత్రంలో బల్దియా కార్యదర్శి రాజు

కోల్‌సిటీ(రామగుండం): శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) వీపీ గౌతం ఆదేశించారు. రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ కమిషనర్లతో సీడీఎంఏ సోమవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గోదావరిఖని స్థానిక గౌతమినగర్‌లోని మున్సిపల్ కంపోస్ట్ యార్డులో ల్యాప్‌టాప్ ద్వారా అదనపు కలెక్టర్, రామగుండం ఎఫ్ఏసీ మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. రామగుండంలో పొడిచెత్తతో డీఆర్‌సీ సెంటర్‌ను ఉపయోగిస్తున్న తీరు, తడిచెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేస్తున్న వైనం గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీడీఎంఏకు అరుణశ్రీ చూపించారు. కంపోస్టు తయారీ పనితీరును మరింత మెరుగుపర్చాలని సీడీఎంఏ సూచించారు. ఈ కార్యక్రమంలో బల్దియా సెక్రటరీ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్, వైకుంఠం, సునీల్ రాథోడ్, ఎన్వరాన్‌మెంట్ ఇంజినీర్ మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

అకాడ అంటేనే రామగుండం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- ప్రాచీన కళలను కాపాడుకోవాలని నగరవాసులకు సూచన

గోదావరిఖనిటౌన్/కోల్‌సిటీ(రామగుండం): దసరాకు అకాడ కళ ప్రదర్శన అంటేనే రామగుండం ప్రాంతం గుర్తుకొస్తుందని, ప్రాచీన కళ అయిన అకాడను అందరూ ఆదరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని విద్యానగర్‌లోని జై భారత్ హనుమాన్ అకాడ శిక్షణ తరగతులను ఎమ్మెల్యే ఆదివారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. 37 సంవత్సరాలుగా అకాడ వస్తాదులు మచ్చ శంకర్, ఎండీ జాఫర్ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీన యుద్ధ కళలను కాపాడటానికి వస్తాదులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అకాడలో శిక్షణ పొందుతున్న చిన్నారులతో ఎమ్మెల్యే సరదాగా విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు కాల్వ లింగస్వామి, పాతిపల్లి ఎల్లయ్య, యుగంధర్, సింహాచలంతోపాటు అకాడ క్యాప్టెన్లు విశ్వాస్, సమ్మయ్య, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

తీరొక్క రూపం.. భక్తిపారవశ్యం



రంగంపల్లిలో..



పెద్దపల్లి హనుమాన్‌నగర్‌లో చండీహోమం



పెద్దపల్లి తిలక్‌నగర్‌లో..



కుంకుమ పూజలు..

జిల్లాలోని దుర్గాదేవి ఆలయాలు, మండపాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తీరొక్క రూపాలతో దర్శనమిస్తున్న ఆదిపరాశక్తిని కుంకుమపూజలతో కొలుస్తున్నారు. భజనలు, నిత్యాన్నదానాలతో సందడి చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పెద్దపల్లిరూరల్: పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపర్చడంపై పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్డీవో, పెద్దపల్లి మండల ప్రత్యేకాధికారి గంగయ్య సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆస్తిపన్ను వసూలుపై శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, కార్యదర్శులు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



కరుణాకుమారితో సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా కరుణాకుమారి సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి దాకా అదనపు బాధ్యతలను నిర్వహించిన గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఏవీఎస్ రాజు నుంచి హనుమకొండ జిల్లా గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేస్తున్న కరుణాకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది మహమ్మద్ గఫార్, యూనుస్‌ఖాద్రీ, స్వరూప, నాగభూషణం, మౌళి, మస్తాన్‌బీ, సంపత్, భారతి, దీప తదితరులు ఆమెను సత్కరించారు.

చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం



సాయికుమార్ (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేటకు చెందిన కాసర్ల సాయికుమార్(22) ధర్మారం మండలం శాయంపేటలోని బంధువుల ఇంట్లో ఉంటూ ధర్మారం అర్బన్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఎండపల్లి మండలంలోని గుల్లకోటకు చెందిన పాలకుర్తి సాగర్‌ను అతని ఇంటివద్ద దింపడానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగివస్తుండగా గుల్లకోట ఐకేపీ సెంటర్ సమీపంలో చెట్టును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరద కాలువలో వృద్ధుడి మృతదేహం

- నిజామాబాద్‌వాసిగా గుర్తింపు

కథలాపూర్(వేములవాడ): మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువలో సోమవారం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండలం దొన్కల్ గ్రామానికి చెందిన రామగిరి నర్సయ్య(70)గా గుర్తించామన్నారు. ఈ నెల 5న అతను అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు మోర్తాడు పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. కథలాపూర్ హెడ్‌కానిస్టేబుల్ మధుకర్, కానిస్టేబుల్ నవీన్ పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడ.. 'జూలపల్లి' అడ్డా

- ఆటలో రాణిస్తున్న మండల క్రీడాకారులు
- జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లలో సత్తా
- క్రీడా కోటాలో పోలీస్ శాఖతోపాటు ప్రైవేటు ఉద్యోగాల సాధన
- ఇద్దరు ఎస్సైలుగా, 35 మంది కానిస్టేబుళ్లుగా ఎంపిక
- ఏటా వాలీబాల్ శిక్షణ శిబిరం ఏర్పాటు



టోర్నమెంట్‌లో జూలపల్లి వాలీబాల్ జట్టు క్రీడాకారులు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): జూలపల్లి మండలం.. వాలీబాల్ క్రీడకు పెట్టింది పేరు. 30 ఏళ్లుగా ఇక్కడి యువకులు వాలీబాల్ క్రీడలో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు, మెమెంటోలు గెలిచి, క్రీడా కోటాలో ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో ఉద్యోగాలు సాధించి, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, కళాశాల ఆవరణలో ఉన్న క్రీడా మైదానంలో ప్రతీరోజు వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తూ నైపుణ్యం పొందిన యువకులు.. కొత్తగా ఆడేందుకు వచ్చే వారికి మెలకువలు నేర్పుతూ వాలీబాల్ వారు ఆటలో రాణించేందుకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

టోర్నమెంట్ ఎక్కడైనా జూలపల్లి టీంలు..

జిల్లా, రాష్ట్రస్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ ఉంటే జూలపల్లి మండలం నుంచి జూనియర్, సీనియర్ జట్లు ఉండాల్సిందే. అంతలా వాలీబాల్ క్రీడలో ఇక్కడి యువత రాణిస్తున్నారు. అంతేకాదు.. ట్రోఫీ సాధిస్తుందన్న నమ్మకం కూడా మండలవాసుల్లో బలంగా ఉంది.

క్రీడా కోటాలో పలువురికి ఉద్యోగాలు..

వాలీబాల్ ఆటలో రాణిస్తున్న మండల యువతలో ఇద్దరు ఎస్సై, 35 మంది సివిల్, సీఆర్‌పీఎఫ్, ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుల్, కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో, పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉద్యోగాలు సాధించారు. రాబోయే పోలీస్ రిక్రూట్‌మెంటులో మరికొందరు క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించేందుకు సాధన చేస్తున్నారు.

20 ఏళ్లుగా శిక్షణ



జూలపల్లిలో 20 ఏళ్లుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో విద్యార్థులకు వాలీబాల్‌తోపాటు ఇతర క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు ఆటల్లో నైపుణ్యం పెంచుతూ ఉత్తమ క్రీడాకారులుగా రాణించేందుకు కృషి చేస్తున్నాం.

– బొమ్మెనవేని సతీశ్, అబ్బాపూర్, పీఈటీ, శిక్షణ శిబిరం కోచ్

శారీరక, మానసికోల్లాసం ..



క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుంది. యువకులు ఆరోగ్యంగా ఉండటమే కాక, ఉద్యోగ సాధనలో ఎంతగానో ఉపయోగపడతాయి. ఏటా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ కేంద్రంలో విద్యార్థులు ఆటలు నేర్చుకోవాలి.

– దామెర కమలాకర్ రెడ్డి, బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగి, కోనరావుపేట

క్రీడా కోటాలో ఉద్యోగం



నేడు వాలీబాల్ జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లలో ఆడాను. మా జట్టు తరఫున ఎన్నో మెమెంటోలు సాధించాం. నాకు క్రీడా కోటాలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి.

– ఖాజామియా, ఏపీఎస్పీ కానిస్టేబుల్, జూలపల్లి

క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి



విద్యార్థులు, యువకులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి. ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ఉన్నందున ఆ దిశగా లక్ష్యం సాధించేందుకు కృషి చేయాలి. క్రీడలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వడమే కాక ఆరోగ్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయి.

– అమరగాని గంగాధర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు, కానిస్టేబుల్, జూలపల్లి

పండుగపూట పస్తులు ఉండాలా?



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

- పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించండి
- మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయండి
- కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

పెద్దపల్లిరూరల్: గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులందరికీ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని పంచాయతీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్(సీఐటీయూ) ఎండీ ఖాజీ డిమాండ్ చేశారు. దసరా పండుగకు పస్తులు ఉండకుండా చూడాలన్నారు. సీఐటీయూ నాయకుడు సీపెల్లి రవీందర్, కార్మిక సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో ఖాజా మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు జరుపుకునే అతిపెద్ద పండుగ దసరా అని, ఈ పండుగ కోసమైనా కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లచ్చయ్య, శ్రీనివాస్, నరేశ్, లక్ష్మణ్, అశోక్, రాజయ్య, ప్రేంకుమార్, నాగయ్య, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం: తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన చింతలపల్లి సతీశ్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి, తన సోదరి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, పరిశీలించగా 10 తులాల బంగారం, రూ.45 వేలు కనిపించలేదు. దొంగతనం జరిగిందని నిర్ధారించుకొని, పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

రుద్రంగి/చందుర్తి(వేములవాడ): రుద్రంగి మండల కేంద్రం శివారులో సోమవారం గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఖానాపూర్‌కు చెందిన సింగిరెడ్డి శ్రీధర్ కొన్ని రోజులుగా గంజాయి మత్తుకు అలవాటు పడ్డాడు. గంజాయి కొనుగోలు చేసి తాగగా మిగిలిన గంజాయితో సోమవారం వేములవాడ నుంచి ఆర్మూర్‌కు బైక్‌పై వెళ్తున్న క్రమంలో రుద్రంగి శివారులో పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద ఉన్న 70 మిల్లీగ్రాముల గంజాయి, సేవించటానికి వినియోగించే పైపు, అతని బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నర్సయ్య మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అడ్లూరి నర్సయ్య(40) సోమవారం బైక్‌పై మల్లాపూర్ మండలంలోని పాతదాంరాజుపల్లికి వచ్చి, తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో సంగెం-శ్రీరాంపూర్ వద్ద గ్యాస్ సిలిండర్ల లోడ్ ఉన్న టాటాఏస్ వాహనాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా రోడ్డుపై నిలిపి ఉంచాడు. నర్సయ్య అతివేగంగా వచ్చి, ఆ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): క్షణికావేశంలో పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన శనిగరపు మహేందర్ (22) దళితబంధులో వచ్చిన ట్రాక్టర్ అమ్మి కారు కొనివ్వాలని ఆదివారం తండ్రితో వాగ్వాదానికి దిగాడు. తండ్రి ట్రాక్టర్‌నే నడుపుకుందామని తెలపడంతో మనస్తాపానికి గురై ఇంట్లోకి వెళ్లిపురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి భద్రయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ సంపత్ వివరించారు.

గునుగు పూలకు వెళ్లి.. మృత్యుఒడికి

- ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి
- జంగపల్లిలో విషాదం



కాళిదాసు (ఫైల్)



రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

గన్నేరువరం: బతుకమ్మ పండుగపూట గన్నేరువరం మండలంలోని జంగపల్లిలో విషాదం నెలకొంది. గునుగు పూలు కోసుకువచ్చేందుకు వెళ్లిన ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. జంగపల్లికి చెందిన గుంటుక కాళిదాసు(50) సద్దుల బతుకమ్మ వస్తోందని, గునుగు పూలు తీసుకువస్తానంటూ ఆదివారం ఇంట్లో చెప్పి, బయటకు వెళ్లాడు. మధ్నాహ్నమైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు తమ పొలం వద్దకు వెళ్లి, చూశారు. అక్కడ లేకపోవడంతో కంగారుపడ్డారు. చుట్టుపక్కల వెతకడంతోపాటు బంధువులు ఇళ్లలో వాకబు చేశారు. అయినా, కాళిదాసు ఆచూకీ తెలియలేదు. సోమవారం మళ్లీ వెతకగా గ్రామానికే చెందిన ఓ వ్యక్తి బావిలో అతని మృతదేహం, గునుగుపూలు కనిపించాయి. ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతి చెందినట్లు మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

పాస్‌పోర్టు తీసుకున్నరు.. ఒక్కపూటే తింటున్న

- నన్ను ఏజెంట్ మోసం చేశాడు..
- స్వగ్రామం వచ్చేలా చూడండి..
- ఇరాక్‌లో సారంగాపూర్ యువకుడి ఇబ్బందులు
- వీడియో తీసి, పంపిన బాధితుడు



ఇరాక్‌లో అజయ్

సారంగాపూర్(జగిత్యాల): నా పాస్‌పోర్టు లాయర్ తీసుకున్నరు.. ఒక్కపూటే తింటున్న.. నన్ను ఏజెంట్ మోసం చేశాడు.. స్వగ్రామం వచ్చేలా చూడండి.. అంటూ ఇరాక్ వెళ్లిన సారంగాపూర్ యువకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం తనను ఇంటికి వచ్చేలా చొరవ చూపాలని కోరుతూ ఓ వీడియో రికార్డు చేసి, స్థానిక విలేకరులకు పంపించాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లపు అజయ్‌ది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు రాధ-గంగయ్య వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన ఓ ఏజెంట్ ఇరాక్‌లో వేతనాలు బాగా ఉంటాయని, తనతో కలిసి పని చేస్తాడని నమ్మబలకడంతో అజయ్ అతనికి రూ.2.70 లక్షలు చెల్లించాడు. ఏజెంట్ ఇరాక్ వెళ్లి, 14 నెలల క్రితం అజయ్‌ని అక్కడికి రప్పించుకున్నాడు. కానీ, వెళ్లినప్పటి నుంచి ఎలాంటి పని లేకపోవడంతో అతను గదికే పరిమితమయ్యాడు. ఉపాధి కోసం వెళ్లిన అజయ్‌కి తిండి దొరకడం కూడా కష్టంగా మారింది. నిత్యం తల్లిదండ్రులకు ఫోన్ చేస్తూ తన పరిస్థితిని వివరిస్తున్నాడు. ఒక్కపూటే తింటున్నానని, తన వద్ద ఐడీ కార్డు లేదని, పాస్‌పోర్టును ఇక్కడి లాయర్ తీసుకున్నారని, తాను ఇంటికి వస్తానంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కొడుకు బాధ చూడలేక అతని తిండికి, స్వగ్రామం రావడానికి తల్లిదండ్రులు 3 నెలల క్రితం రూ.లక్ష, 20 రోజుల క్రితం మరో రూ.66 వేలు పంపించారు. కానీ, పాస్‌పోర్టును అక్కడి అడ్వకేట్ తీసుకోవడంతో తమ కొడుకు ఇంటికి రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాడని వారు రోదిస్తున్నారు. అజయ్ ఇక్కడికి వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతిగౌడ్



మాట్లాడుతున్న జడ్జి మూల స్వాతిగౌడ్

రామగిరి(మంథని): గ్రామంలోని ప్రతీఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మంథని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి మూల స్వాతిగౌడ్ సూచించారు. బేగంపేట గ్రామంలో సోమవారం పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. చట్టాలపై మహిళలు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. న్యాయం పొందడం ప్రతీఒక్కరి హక్కు అని, చట్టాలపై అవగాహనతోనే ఇది సాధ్యమని తెలిపారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ఉచిత న్యాయ సాయం, గృహహింస, నిర్వహణ, మోటార్ వాహనం తదితర చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మంథని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.రఘోత్తంరెడ్డి, సీఐ రాజుగౌడ్, ఎస్సై చంద్రకుమార్, న్యాయవాదులు శశిభూషణ్ కాచే, బండ మాధురి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాది సామ్రాజ్యవాద ఆకాంక్ష

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ



నిరసన తెలుపుతున్న న్యూడెమొక్రసీ నాయకులు కృష్ణ, నరేశ్, అశోక్, శంకర్ తదితరులు

గోదావరిఖని: అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న కోరారు. స్థానిక కోర్టు చౌరస్తా సమీపంలోని పైలాన్ వద్ద సోమవారం నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ, పాలస్తీనా(గాజా)పై ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలిపివేయాలన్నారు. పాలస్తీనాపై మారణహోమం ప్రారంభించి అక్టోబర్–7వ తేదీకి ఏడాది పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని అన్నారు. యుద్ధంలో ఇప్పటికే 50 వేల మంది ప్రజలు చనిపోయారని, పిల్లలు, స్త్రీలను లక్ష్యంగా చేసుకుని గాజా ప్రాంతాన్ని శ్మశాన భూమిగా మార్చుతున్నారని ధ్వజమెత్తారు. పాలాస్తినాకు మద్దతు ఇస్తున్న సిరియా, ఇరాన్, యెమెన్, లెబనాన్ తదితర దేశాలపై దాడులను కొనసాగిస్తోంని అన్నారు. భద్రతామండలి అగ్రరాజ్యాల జేబు సంస్థలుగా మారిందని ఆరోపించారు. దాడులతో విదేశీ ఎగుమతులు, దిగుమతుల విషయంలోనే కాకుండా, చమురు ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులకు పెనుభారంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ నాయకులు ఇ.నరేశ్, బి.అశోక్, చిలుక శంకర్, కె.మల్లేశ్, మేరుగు చంద్రయ్య, లింగమూర్తి, ఎడ్ల రవికుమార్, సమ్మెట తిరుపతి, ఎల్లయ్య, మంగ, ఎస్‌సీ బాబు, రాజకొమరయ్య, ఆర్.రాయమల్లు, నర్సయ్య, కాంపెల్లి మల్లేశ్, శ్రీకాంత్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ధ్యేయం

- ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ
- డిస్పెన్సరీలో పది పడకల క్యాజువాల్టీ ప్రారంభం



క్యాజువాల్టీ ప్రారంభిస్తున్న జీఎం సూర్యనారాయణ, ఏసీఎం కిరణ్‌రాజ్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా యాజమాన్యం ముందుకు సాగుతోందని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. ఏరియాలోని సెక్టార్–3 డిస్పెన్సరీలో పది పడకల క్యాజువాల్టీ కేంద్రాన్ని ఆయన గోదావరిఖని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌రాజ్ కుమార్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అధునాతన వైద్య పరికరాలతో క్యాజువాలిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి అత్యవసర సేవల కోసం 12 కి.మీ. దూరంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లే అవసరం ఉండదని తెలిపారు. ఇక్కడే అన్ని సదుపాయాలతో క్యాజువాలిటీ బ్లాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంస్థ సీ అండ్ఎం డీగా బలరాం బాధ్యతలు చేపట్టిన తర్వాత వైద్య సదుపాయాలు మెరుగుపర్చేందుకు అన్ని ఆస్పత్రుల్లో ధునిక పరికరాలు, సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు జిగురు రవీందర్, సీఎంవోఏఐ ప్రతినిధి సుగుణాకర్, పర్సనల్ డీజీఎం ఎస్.అనిల్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, డీజీఎం(సివిల్) ధనుంజయ, డీజీఎం(ఫైనాన్స్) వెంకటరామచంద్ర, ఏరియా సర్వే అధికారి బుక్యదేశాయ్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి జె.సునీత, డాక్టర్లు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేస్తున్న సర్కార్

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్



నిరసన తెలుపుతున్న నాయకులు రాజేందర్, సాగర్, శంకర్ తదితరులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలను చేడతామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన చేసిన కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చాక మాట తప్పారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ విమర్శించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో సైతం హామీ ఇచ్చారని, కానీ, ఇప్పటివరకు అమలు చేయక పోవడం దురదృష్టకరమన్నారు. అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకొస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎస్సీ వర్గీకరణ అమలు చేయక పోతే జిల్లా కేంద్రంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నాయకులు పుల్లూరి సాగర్, శంకర్, వివేక్, సదానందం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాల అభివృద్ధికి ప్రాధాన్యత



చెరువులో చేపపిల్లలు వదులుతున్న సాయికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రమ తదితరులు

- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

మంథని: రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. పట్టణంలోని తమ్మిచెరువులో సోమవారం ఉచిత చేపపిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో చేపపిల్లలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చేపపిల్లలను చెరువుల్లో వేసి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని, తద్వారా ఆ కుటుంబాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, దాని అనుబంధ రంగాల్లో వెలుగులు నింపడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రతీచెరువుకు మూడు రకాల చేపపిల్లలు కేటాయిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్ పోతరవేణి క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సాయికుమార్‌ను సన్మానించారు. అలాగే సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సన్మానించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మత్స్యకార కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ పోతరవేణి క్రాంతికుమార్ రాష్ట్ర చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కులం సర్టిఫికెట్ల పేరిట ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఆ నిబంధన తొలగించినట్లు సాయికుమార్ చెప్పారు. ప్రభుత్వం మత్స్యకార కుటుంబాల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఆయన వివరించారు.